నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 మహబూబ్‌నగర్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 JOGULAMBA GADWAL WANAPARTHY



చలో నల్లగొండ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# అంకెల గారడీగా బడ్జెట్

- వ్యక్తిగతవిమ ర్శలు తప్పా కాంగ్రెస్‌కుపా లనపైధ్యా సలేదు
- చలో నల్లగొండ కార్యక్రమాన్నివిజ యవంతంచే యాలి
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 10 : ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొనే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీయే తప్పా ప్రజా సంక్షేమానికి పాటుపడేలా ఏ ఒక్క ప్రకటన లేదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్పా చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. అప్పుల రాష్ట్రంగా మార్చారని చెబుతున్న మీరు 60 రోజుల్లోనే 9వేల కోట్లు అప్పులు ఎందుకు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉన్నత హోదాలో ఉండి అసభ్యపదాలతో విమర్శలు చేయడం సిగ్గుచేటని, పనికిమాలిన మాటలు మాని పాలనపై దృష్టి సారించాలన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలను అర్పించేందుకు సిద్ధపడిన కేసీఆర్‌ను ఇష్టానుసారంగా మాట్లాడితే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. ఇకనైనా సోయి తెచ్చుకొని ప్రజా సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈనెల 12వ తేదీన కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గువ్వల బాలరాజు, ఎంపీ రాములుతోపాటు పలువురు హాజరవుతున్నారన్నారు. 13న నల్లగొండ సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చలో నల్లగొండ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, వైస్ చైర్మన్ షాహెద్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, నాయకులు లాలయ్యగౌడ్, ఈశ్వరయ్య, బాలయ్య, రాంరెడ్డి, చెన్నకేశవులు, ఎల్‌ఎన్ రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జోగుళాంబ బ్రహ్మోత్సవాలు

- ధ్వజారోహణంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు
- భారీగా తరలివచ్చిన భక్తులు

అలంపూర్, ఫిబ్రవరి 10 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ జోగుళాంబ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జోగుళాంబ అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు, భక్తులు బాలబ్రహ్మేశ్వర స్వామి గర్భాలయానికి చేరుకున్నారు. స్వామికి వస్త్రాలంకరణ చేసి త్రిశూల రాజంతో పల్లకీలో తిరిగి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. సమయంలో నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. జోగుళాంబ క్షేత్రం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు, భక్తులు పాల్గొన్నారు.



ధ్వజారోహణంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

గుడెబల్లూరు, దేవసూగూర్ మధ్య కృష్ణానదిపై కొనసాగుతున్న ఫోర్‌లేన్ బ్రిడ్జి నిర్మాణ పనులు



# కృష్ణ.. కృష్ణా!

- నదిపై ముందుకు సాగని కృష్ణా ఫోర్‌లేన్ బ్రిడ్జి పనులు
- రూ.150కోట్లతో 2019లో ప్రారంభం
- పూర్తయ్యేందుకు మరో ఏడాది అవకాశం
- కాలినడకన నది దాటుతున్న ప్రజలు
- పాత బ్రిడ్జి మరమ్మతుతో నిలిచిన రాకపోకలు
- దూర, వ్యయభారంతో ప్రయాణికుల పాట్లు

ఊట్కూర్, (కృష్ణ) ఫిబ్రవరి 10 : మక్తల్ నియోజకవర్గంలోని గుడెబల్లూరు, కర్ణాటక రాష్ట్రం దేవసూగూర్ గ్రామాల మధ్య కృష్ణానదిపై నూతనంగా నిర్మిస్తున్న ఫోర్‌లేన్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాలుగేండ్లుగా మందకొడిగా పనులు చేపడుతుండడంతో ఇటు తెలంగాణ, అటు కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్, గోవా, తమిళనాడు, మహారాష్ట్రకు రాకపోకలు కొనసాగించేందుకు ప్రయాణికులపై తీవ్రమైన భారం పడుతున్నది. కృష్ణానదిపై 750 మీటర్ల పొడవున చేపట్టిన ఈ ఫోర్‌లేన్ బ్రిడ్జి నిర్మాణ పనులను కర్ణాటకలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం 2019 సంవత్సరంలో ప్రారంభించింది. రూ.150కోట్లతో క్రిషి ఇన్ఫ్రాటెక్‌కు పనులను అప్పగించింది. పనులను ప్రారంభించిన ఏడాదిలోపే కరోనా కారణంగా కొన్నాళ్ల పాటు బ్రిడ్జి నిర్మాణం అర్ధాంతరంగా నిలిపివేసి రెండేండ్ల తర్వాత తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం నదిలో పిల్లర్, ఫియర్ క్యాప్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించే ఫోర్‌లేన్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు మరో ఏడాది పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాది నవంబర్, లేదా డిసెంబర్ నెలాఖరు నాటికి పనులను పూర్తి చేయిస్తామని క్రిషి ఇన్ఫ్రాటెక్ ఉద్యోగి ఒకరు తెలిపారు. కర్ణాటకలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

***పాత బ్రిడ్జి మరమ్మతుతో ప్రయాణికుల ఇబ్బందులు..***

తెలంగాణ, కర్ణాటక సరిహద్దు శివారులోని కృష్ణానదిపై 1944 నిజాం నవాబు కాలంలో నిర్మించిన బ్రిడ్జి మరమ్మతు పనులను గత నెల 15వ తేదీన అధికారులు ప్రారంభించారు. బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలతో బీటీ రోడ్డు పలుమార్లు పాక్షికంగా దెబ్బతిన్నది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో గతేడాది అధికారులు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. పనులు పూర్తయిన కొన్ని నెలలకే తిరిగి బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో తాత్కాలిక నిర్మాణం చేపట్టేందుకు క్రిషి ఇన్ఫ్రాటెక్‌కు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. మరమ్మతులో భాగంగా అర ఫీటు లోతు వరకు బీటీ లేయర్‌ను తొలగించి కొత్తగా సిమెంట్, కాంక్రీట్‌తో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. బ్రిడ్జిపై వేసిన సీసీరోడ్డు నెల రోజుల వరకు వాటర్ క్యూరింగ్ చేపట్టేందుకు వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిషేధించారు. పెద్ద వాహనాలతోపాటు టూ వీలర్ వాహనాలను సైతం బ్రిడ్జిపైకి అనుమతించడం లేదు. రాకపోకలను నిషేధిస్తూ అటు కర్ణాటక, ఇటు తెలంగాణ పోలీసులు బార్డర్ చెక్‌పోస్టుల వద్ద ఇనుప కంచెలను ఏర్పాటు చేసి కాపలా కాస్తున్నారు.



పాత బ్రిడ్జిపై కొనసాగుతున్న వాటర్ క్యూరింగ్ పనులు

### కాలినడకన నది దాటుతున్నా..



కర్ణాటకలోని కడెచూర్‌లో ఇంటర్ ఫస్టియర్ డిప్లొమా కోర్సు చదువుతున్నా. దేవసూగూర్ నుంచి ప్రతి రోజూ నదిలో నడుచుకుంటూ టై రోడ్డుకు చేరుకుంటున్నా. దీంతో సమయానికి కళాశాలకు చేరుకోలేకపోతున్నా. చదువుకు ఆటంకం కలుగుతున్నది. చాలా దూరం నడవడంతో కాళ్లు నొప్పులవుతున్నాయి.

*- బసవ ప్రభు, విద్యార్థి, దేవసూగూర్*

### ఆయాసం వస్తోంది..



మాది కర్ణాటక రాష్ట్రం దేవసూగూర్ గ్రామం. సైదాపూర్‌లో మా కూతురు ఉంటుంది. రెండు రోజుల కిందట అక్కడికి నది దాటి నడుచుంటూ వెళ్లిన. ఈరోజు మళ్లీ మా ఊరు వెళ్లేందుకు టై రోడ్డు వద్ద బస్సు దిగి నడుచుకుంటూ దేవసూగూర్‌కు వెళ్తున్నా. బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో ఏమో. ఇంత దూరం నడిచి ఆయాసం వస్తుంది. *- భాగమ్మ, వృద్ధురాలు*

### వాహనాల దారి మళ్లింపు..

హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు జడ్చర్ల వయా భూత్పూర్, కొత్తకోట, ఎర్రవల్లి, గద్వాల మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి రాయిచూర్ వెళ్లే వాహనాలను నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రం నుంచి అమరచింత, మస్తీపూర్ వయా జూరాల డ్యాం, గద్వాల నుంచి రాయిచూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. మరో వైపు తెలంగాణ, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రయాణికులు నదిపై రాకపోకలు సాగించేందుకు హిందూపూర్, కడేచూర్, సైదాపూర్, గుడూర్, గూగళ్, గబ్బూర్ మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. దీంతో ప్రయాణికులు దూరభారంతో సతమతమవుతున్నారు. మరో పక్క హైదరాబాద్ నుంచి రాయిచూర్‌కు నడిచే ఆర్టీసీ బస్సులను చివరి హాల్ట్ టైరోడ్డు వరకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి నది అంతర్భాగాన్ని దాటుకుంటూ ప్రయాణికులు కాలినడకన దాదాపు 3 కిలోమీటర్లు కర్ణాటక రాష్ట్రం దేవసూగూర్‌కు చేరుకుంటున్నారు. ఇదే క్రమంలో కర్ణాటక నుంచి తెలంగాణలోకి వచ్చే ప్రయాణికులు సైతం కాలినడకన టై రోడ్డుకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పాత బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అనుమతి లభిస్తే తప్పా ప్రయాణికుల కష్టాలు తీరవు.

### వాహనాలను పూజకు తెస్తే..

భక్తులు కొనుగోలు చేసిన కొత్త వాహనాలకు ఆంజనేయుడి సన్నిధిలో పూజలు చేయిస్తుంటారు. అయితే ఈ పూజలు పూజారులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. దేవాలయ కౌంటర్‌లో డబ్బులు చెల్లించి వాహనాల పూజకు సంబంధించిన రసీదును భక్తులు తీసుకుంటారు. అయినా వాహనాలకు పూజలు నిర్వహించేందుకు పూజారులు పోటీపడుతున్నారు. నేను చేస్తానంటే నేను చేస్తానంటూ వాహనం వద్దకు పోటాపోటీగా వస్తారు. కొన్ని సందర్భాల్లో వాళ్లల్లో వారికే గొడవ జరుగుతున్నది. అయితే ఎలాగోలా పూజ అయిన తర్వాత అసలు కథ మొదలవుతుంది. దక్షిణ పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తారు. ఇచ్చినంల తీసుకోరు. పూజారులు అడిగినంతా సమర్పించాల్సిందే. ఒకరిద్దరు పూజారులుమిన హా.. మిగతా వారంతా భక్తులను పీల్చుకుతింటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

# భక్తులకు శఠగోపం!

## అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో..

- ఊర్కొండపేటఆ ంజనేయ స్వామిఆ లయంలో పూజారులచే తివాటం
- పేరుకే ఎండోమెంట్.. పెత్తనమంతా వారిదే..
- భక్తులనునిలు వు దోపిడీ చేస్తున్న వైనం
- బ్రహ్మోత్సవవే ళ ప్రజలకు తప్పని ఇక్కట్లు



వాహనాలకు పూజలు చేస్తున్న అర్చకులు



అభయాంజనేయస్వామి ఆలయం

కల్వకుర్తి, ఫిబ్రవరి 10 : అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్న సామెత ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయ పూజారులకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. తమకు నచ్చిన వారు.. కాసులు ఇచ్చే వారికి పెద్దపీట వేస్తూ.. సామాన్య భక్తులకు చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలను వారు మూటగట్టుకుంటున్నారు. ఆలయ పూజారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆలయ నిర్వహణ అంతా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నా.. ఇక్కడ మాత్రం పూజారులదే పెత్తనం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూజారులను ప్రక్షాళన చేస్తే తప్ప మరో మార్గం లేదని భక్తులు పేర్కొంటున్నారు.

***బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు***

వారం రోజులుగా అంజన్న బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. అయితే ఆలయంలోని పూజారుల తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బులిచ్చేవారు.. తెలిసిన వారు వస్తే వారిని గర్భగుడిలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సామాన్య భక్తులు మాత్రం క్యూలో గంటల కొద్దీ వేచి ఉండి స్వామిని దర్శించుకోవాల్సి వస్తుంది. ఇదేమని అడిగితే మీ ఇష్టం ఉంటే ఉండండి.. లేకుంటే వెళ్లిపోండని సమాధానం చెబుతున్నారని పలువురు భక్తులు వాపోతున్నారు. మరో విచిత్రమైన విషయం ఏమిటంటే ఆలయానికి వచ్చిన భక్తులను ఒకరిద్దరు మినహా మిగతా పూజారులు దక్షిణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దక్షిణ ఇవ్వకుంటే కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని భక్తులు మండిపడుతున్నారు. భక్తితో స్వామిని దర్శించుకుందామని వస్తే.. కాసులిస్తేనే పట్టించుకుంటారా..? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

***సత్యనారాయణ స్వామి వ్రతాల్లోనూ దోపిడీ***

ఆలయంలో ప్రతి నిత్యం సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు ఆచరిస్తారు. మంగళ, శని వారాల్లో వ్రతాల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. వ్రతాల్లో పూజారుల దోపిడీ అంతా ఇంతా కాదు. వ్రతం ఆచరించిన వారి నుంచి ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తారు. సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించడానికి దేవాదాయ శాఖ కౌంటర్‌లో రూ.200 చెల్లించి రసీదు తీసుకోవాలి. ఇందుకుగానూ వ్రతాలను పూజారులు చేయించాలి. వ్రతం పూర్తయిన తర్వాత స్వామి వారి పీటను కదిలించాల్సి ఉంటుంది. ఈ సమయంలో వారు అడినంత డబ్బులు ఇవ్వకపోతే వ్రతం పీటను కదిలించరు. అంతలా వారి డిమాండ్ ఉంటుంది.

***దేవాదాయ శాఖకు చెందిన పూజారి ఒక్కరే..***

అభయాంజనేయ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖకు చెందిన పూజారి ఒక్కరే ఉన్నారు. మిగతా పూజారులు తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న వారే. టెంపరరీ పూజారులదే ఇక్కడ పెత్తనమంతా. దేవాలయ శాఖ అధికారులనే బెదిరించిన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఆలయ ఉద్యోగి ఒకరు తాత్కాలిక పూజారిపై కల్వకుర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కేసు కూడా పెట్టాడు. ఇక్కడి వారి తీరుపై నియోజకవర్గ ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత పూజారులపై చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఆలయ హుండీలో కన్నా.. పూజారులకు దక్షిణలే ఎక్కువగా వస్తున్నాయనే వార్తలకు బలం చేకూరే ఉదాహరణలను ఎండోమెంట్ అధికారులకు ఇచ్చినట్లు సమాచారం.

### పూజారులపై ఫిర్యాదులు నిజమే..

ఆలయంలో పనిచేస్తున్న కొంత మంది పూజారులపై ఫిర్యాదులు వస్తున్నది నిజమే. పూజారుల పనితీరుపై ఎండోమెంట్ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే చర్యలు తీసుకుంటాం. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చర్యలు తీసుకుంటాం. ఉత్సవాలు ముగిసిన వెంటనే ప్రక్షాళన చేపడుతాం.

*- సత్యచంద్రారెడ్డి, ఈవో, ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం*

# ప్లాస్టిక్ బియ్యం కలకలం

- లోకిరేవు రేషన్ దుకాణంలో పంపిణీ
- అవి ప్రొటీన్స్ బియ్యం : డీటీ నాగరాజు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 10 : రేషన్ దుకాణంలో ప్లాస్టిక్ బియ్యాన్ని పోలిన రైస్ మహబూబ్‌నగర్ జిల్లాలో కలకలం రేపాయి. నవాబ్‌పేట మండలం లోకిరేవు గ్రామానికి రెండ్రోజుల కిందట పౌరసరఫరాల శాఖ నుంచి రేషన్ బియ్యం వచ్చాయి. డీలర్ గీతమ్మ శుక్రవారం నుంచి లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించింది. అయితే బియ్యం తీసుకెళ్లిన తెల్లరేషన్ కార్డుదారులు వాటిని వండుకొని తింటుంటే అందులో కొన్ని మెతుకులు రబ్బర్‌లా మెత్తగా సాగడాన్ని గమనించారు. దీంతో పలువురికి అనుమానం వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. తెచ్చిన బియ్యంలో అక్కడక్కడ ప్లాస్టిక్ బియ్యాన్ని పోలిన రైస్ కనిపించింది. వాటిని వేరుచేసి సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పెట్టడంతో వైరల్‌గా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు, రెవెన్యూ అధికారులు గ్రామంలోని రేషన్ దుకాణానికి చేరుకొని బియ్యాన్ని పరిశీలించారు. ప్రజలకు విటమిన్స్ అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వమే క్వింటాకు కేజీ చొప్పున బియ్యంలో వివిధ బలవర్ధకమైన (ప్రొటీన్స్) పదార్థాలను తయారు చేయించి కలుపుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు తెలిపారు. బియ్యాన్ని పిండి చేసి బీ-12, ఫ్లోరిక్ యాసిడ్‌తోపాటు సూక్ష్మ పోషక పదార్థాలు యాడ్ చేసి బియ్యాన్ని తయారు చేస్తారన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై గతంలోనే డీలర్లకు అవగాహన కల్పించామని తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన పలువురు బియ్యంపై అనుమానం వ్యక్తం చేశారు. బియ్యం కడిగే సమయంలో వాటర్‌లో తేలుతున్నాయని, వండిన తర్వాత రబ్బర్‌లా మారుతున్నాయని.. తినాలంటే ఒక రకమైన భయం ఉంటుందన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు



# మాఘమాసం వచ్చేసింది.. పెండ్లి కళ తెచ్చేసింది

- నేటి నుంచి పెండ్లిళ్ల సీజన్
- ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో మంచి ముహూర్తాలు
- మోగనున్న బ్యాండ్‌భాజాలు
- ఒక్కటి కానున్న వందలాది జంటలు
- మళ్లీ ఆగస్టులోనే శుభ ఘడియలు

**'మాఘమాసం ఎప్పుడొస్తుందో.. 'పెళ్లి కల వచ్చేసిందే బాలా'.. అంటూ సినిమా పాటలను తలపించేలా శుభ ముహూర్త ఘడియలు వచ్చేశాయి. 11వ తేదీ నుంచి మాఘమాసం ప్రారంభం కానుండటంతో ఇప్పటికే నిశ్చితార్థాలు కుదుర్చుకున్న నూతన వధూవరులు పెళ్లి పీటలెక్కనున్నారు. ఈనెలతో పాటుగా మార్చి, ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ముహూర్తాలు ఉన్నాయి. ఎండాకాలమంతా ఓ వైపు ఊష్ణతాపం, మరోవైపు పార్లమెంట్ ఎన్నికలతో పాటు పీపీపీ.. డుండుండుం.. మోతలు మోగనున్నాయి.**

*- నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ)*

పెళ్లి ముహూర్తాలకు వేళైంది. కొన్ని నెలలుగా ఎదురుచూస్తున్న ఘడియలు రానే వచ్చాయి. ఈనెలతో పాటుగా మార్చి, ఏప్రిల్‌లోనూ పెద్దఎత్తున పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇప్పటికే వివాహాలు నిశ్చయం చేసుకున్న ఆయా కుటుంబాలు తమ పిల్లలకు పెండ్లిళ్లను జరిపించనున్నాయి. ప్రతి సంవత్సరం మాఘమాసం పెండ్లిళ్లకు పెట్టింది పేరు. చాలా మంది ఈ మాసంలో పెండ్లిళ్లు నిర్వహించేందుకు ఇష్టం చూపిస్తారు. అంత కీలకమైన మాఘమాసం 11వ తేదీన ప్రారంభం కానున్నది. ఇక వధూవరుల జాతకాలను బట్టి ముహూర్త తేదీలు, సమయాన్ని పండితులతో ఖరారు చేసుకొంటున్నారు. ఈ జంటలు ఆయా తేదీల్లో పెళ్లి పీటలను ఎక్కి ఒక్కటికానున్నారు. ఈ మాసంలో భాగంగా ఫిబ్రవరి నెలలో 13, 14, 17, 18, 24, 28, 29వ తేదీలు పెండ్లిళ్లకు అత్యంత అనుకూలంగా ఉన్నాయి. ఇక మార్చిలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30వ తేదీలు, ఏప్రిల్‌లో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇలా మూడు నెలల్లో 28 రోజులు పెండ్లిళ్లకు అత్యంత మంచి ముహూర్తాలు ఉండటం గమనార్హం.

***మొదలైన సందడి***

కొంత కాలంగా మాఘమాసం కోసం తల్లిదండ్రులతోపాటు ఆయా ఫంక్షన్ హాళ్ల యజమానులు, పూలు, వస్త్ర వ్యాపారులు, ఫొటోగ్రాఫర్లు, బ్యాండు మేళాల నిర్వాహకులు, కిరాణా వ్యాపారులు, వంట మనుషులు, ట్యాక్సీ వాహనదారులు ఎదురుచూస్తున్నారు. పెండ్లిళ్లతో ఆయా కుటుంబాల్లో ఆనందం, కొత్త జీవితం తీసుకురావడంతో పాటుగా పలువురు వర్తకులు, వేద పండితులు, చిరువ్యాపారులకూ ఉపాధి దొరుకనున్నది. ఎట్టకేలకు మాఘమాసం రావడంతో పెండ్లిళ్లకు ఇప్పటికే కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాల్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. మార్కెట్లలో జనాల సందడి మొదలవగా.. బస్సుల్లో రద్దీ పెరిగింది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో అందుకు తగ్గట్లుగా.. ఏసీలు, ఇతర సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేపట్టనున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికలు జరిగే పరిస్థితులు కూడా ఉండటం పెండ్లిళ్లకు రాజకీయ ప్రాధాన్యతను తీసుకు రానున్నది. ఆయా పార్టీల తరపున నాయకులు, అభ్యర్థులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని ప్రజల్లో మమేకంకానున్నారు. ఫలితంగా ఈ మాఘమాసం ముహూర్తాలు పెండ్లిళ్లకు పొలిటికల్ కళను తీసుకురానున్నాయి.

***ఆగస్టులో తిరిగి..***

ప్రస్తుతం మూడు నెలల ముహూర్తాలు దాటితే మళ్లీ వచ్చే ఆగస్టులోనే మంచి ఘడియలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది ఈ నెలల్లోనే కొత్తగా పెండ్లిళ్లు కుదుర్చుకోవడం, కుదిరిన పెండ్లిళ్లు పూర్తి చేయడానికి పలు కుటుంబాలు సిద్ధమవుతున్నాయి. మొత్తంమీద ఈ ఎండాకాలంలో ఊరూవాడా పెండ్లి మంత్రాలు, బ్యాండుబాజా మేళాలతో హోరెత్తనున్నాయి.